
క్లుప్తంగా

కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువ

మెళియాపుట్టి: మండలంలోని చిన్న నీలాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం ఆరు అడుగుల కొండచిలువను యువకులు హతమార్చారు. కొల్లి తేజమ్మ ఇంటి సమీపంలోని కోళ్ల గూడులో శబ్దాలు రావడంతో వెళ్లి చూశారు. కొండచిలువ కోళ్లను తింటూ ఉండటంతో భయభ్రాంతులకు గురయ్యారు. రెండు నాటు కోళ్లను కొండ చిలువ తిని కదలలేని స్థితిలో ఉంటంతో యువకులు బటకు తీసి హతమార్చారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మెళియాపుట్టి: పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై దృష్టి సారించకపోవడంతో జిల్లాలో మెళియాపుట్టి మండలం చాలావెనుక బడిఉందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉపాధి సమావేశ మందిరంలో కార్యదర్శులు, సచివాలయం, ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ప్రతీరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. చాపర, గొప్పిలి, మెళియాపుట్టి గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. జనరల్ ఫండ్, 15 ఫైనాన్స్ నిధులు, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో వారం రోజుల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలని సూచించారు. ఇదివరకు జిల్లావ్యాప్తంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆరుగురు కార్యదర్శులను సస్పెండ్ చేశామని, నలుగురు సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేశామన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ హనుమంతరావు, ఏఓ తిరుపతిపట్నాయక్, ఏపీఓ రవి, ఏపీఎం లలిత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు



మహాశింగిలో మండల స్థాయి అధికారులు లేకుండా నిర్వహిస్తున్న గ్రామసభ

సారవకోట: మండలంలోని గిరిజన గ్రామాల్లో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో సమస్యలు గుర్తించడంతోపాటు వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాల కోసం గిరిజనులకు తెలియజేయాలి. ఈ గ్రామసభలకు మండల స్థాయి అధికారులు హాజరుకావల్సి ఉన్నా.. ఎక్కడా హాజరయ్యే పరిస్థితి లేదు. పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మమా అనిపిస్తున్నారు. బుధవారం మహాశింగి పంచాయతీలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఏ ఒక్క మండల స్థాయి అధికారి హాజరుకాకుండానే ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆహ్లాదం.. ఆనందం

- సుందరంగా తీర్చిదిద్దిన లుకలాం ఎంపీపీ స్కూల్
- కొబ్బరి మొక్కలు నాటిన విద్యార్థుల తల్లిదండ్రులు
- దాతల వితరణతో విగ్రహాలు, క్రీడా పరికరాల ఏర్పాటు
- నాడు–నేడు నిధులతో పాఠశాల అభివృద్ధి
- ఉపాధ్యాయుడి కృషిని అభినందిస్తున్న గ్రామస్తులు



లుకలాం ఎంపీపీ స్కూల్



స్కూల్ విద్యార్థులు

నరసన్నపేట:

గ్రామస్తుల సహకారం.. ఉపాధ్యాయుల కృషితో మండలంలోని లుకలాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిసరాలు ఆహ్లాదంగా ఉన్నాయి. ఈ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామస్తుల సహకారంతో మహాత్మాగాంధీ, లక్ష్మీదేవి, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలు స్కూల్ ఔన్నత్యాన్ని పెంచాయి. విద్యార్థుల తల్లిదండ్రులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నాటిన 24 కొబ్బరి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వీరి సహకారానికి తోడు ఉపాధ్యాయుడు రమణయ్య కృషితో గత ఐదు ఏళ్లల్లో స్కూల్‌కు వచ్చిన నిధులకు తన సొంత డబ్బులు జోడించి విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడాపరికరాలు ఏర్పాటు చేశారు. గార్డెనింగ్ కూడా బాగుంది. నాడు-నేడు నిధులు రూ.18 లక్షలతో స్కూల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. స్కూల్ వాతావరణం కార్పొరేట్ కంటే మిన్నగా కనిపిస్తోంది. 117 జీఓ అమలుకాక ముందు ఐదు తరగతుల విద్యార్థులు 45 మంది ఉండేవారు. ప్రస్తుతం ఒకటి, రెండు తగరతులకు చెందిన 13 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రధానంగా ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే స్కూల్‌ను ఎలా తీర్చిదిద్దవచ్చో ఈ పాఠశాలే ఉదాహరణ. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు రమణయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇటువంటి ఉపాధ్యాయుడు తమ స్కూల్‌లో పనిచేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దాతల సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాలు



స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు



విద్యార్థుల తల్లిదండ్రులు నాటిన కొబ్బరి మొక్కలు

ఉత్తమ సేవలకు గుర్తింపు



రవికుమార్, ప్రసాద్, అనిత, శ్రీనివాసరావు, పిన్నింటి కృష్ణారావు, పుష్పకుమారి, జి. గోపి, టి.వి.రమణమ్మ, జి.రమామణి, మెండ రామారావు, మెండ సాయిబాబా, బలగ శ్రీనివాసరావు, జి.సూర్యనారాయణ, బల్లెడ అప్పలరాజు, జి.రాజశేఖర్, జి.జీవన్‌బాబు, ఎ.సంజీవరావు, సత్యరాజు, రామకృష్ణ, ఎన్ శంకరరావు, కె.నాగరాజు, బి.విజయభారతి, జన్ని సంపతిరావు, కామేశ్వరరావు

నరసన్నపేట: మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపికయ్యారు. మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న ఆర్.రవికుమార్, బాడాం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు చల్ల వరప్రసాద్, నరసన్నపేట పంచాయతీ దేశవానిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కె.అనితకు అవార్డులు దక్కాయి. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం వీరికి శ్రీకాకుళంలో కలెక్టర్ అవార్డులను ఇవ్వనున్నారు. తమకు మరింత బాధ్యత పెంచిందన్నారు.

పోలాకి: కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.వి.శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయసంఘాల నాయకులు, అధికారులు అభినందించారు.

కొత్తూరు: మాతల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పన్నింటి కృష్ణారావు, మాకవరం యూపీ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న గుంటముక్కల గోపి, గులివిందలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కేవీసీహెచ్ పుష్పకుమారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ఆమదాలవలస: మండలం, మున్సిపాలిటీలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.వి.రమణమ్మ, పీరుసాహెబ్‌పేట ఎంపీ స్కూల్ ఉపాధ్యాయిని జి.రమామణి, వంజంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు జామి నాగరాజు ఎంపికయ్యారు.

జలుమూరు: మండలం నుంచి నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. జలుమూరు ప్రాథమిక పాఠశాల నుంచి మెండ రామారావు, సైరిగాం ప్రాథమిక పాఠశాల నుంచి మెండ సాయిబాబా, రావిపాడు పాఠశాల నుంచి జి.సూర్యనారాయణ, బసివాడ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బలగ శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

పాతపట్నం: మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపికైనట్లు ఎంఈఓ బి.శ్రీధర్ బుధవారం తెలిపారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బల్లెడ అప్పలరాజు, పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న శిమ్మ కృష్ణారావు, కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న జన్ని కృష్ణారావు ఎంపికయ్యారు.

పొందూరు: మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు వివిధ కేటగిరీల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వావిలపల్లిపేట ఏపీ మోడల్ స్కూల్‌లో బోటనీ బోధిస్తున్న జి.జీవన్ బాబు, పిల్లలవలస జెడ్పీహెచ్ఎస్ నుంచి పీడీ జి.రాజశేఖర్, హెచ్ఎం విభాగంలో లోలుగు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎ.సంజీవరావు, తోలాపి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వాకముల్లు సత్యరాజు ఉన్నారు.

హిరమండలం: మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపికైనట్లు ఎంఈఓ రాంబాబు తెలిపారు. కోరాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్జీటీ నార శంకరరావు, పిండ్రువాడ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి పల్లి రాంబాబు, తంప ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, చిన్నకోరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కరణం నాగరాజు ఎంపికయ్యారు.

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న బి.విజయ భారతి, మాకనాపల్లి యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు జన్ని సంపతిరావు, భావనాపురం యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు తలగాపు కామేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

- కలెక్టర్‌కు ఫిర్యాదు



హాజరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని సైలాడ గ్రామ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామ సచివాలయాన్ని తనిఖీ నిర్వహించారు. ఉద్యోగుల హాజరును పరిశీలించి సంతకాల డొల్లతనాన్ని గుర్తించారు. సచివాలయంలో ఉన్న ఇద్దరు ఉద్యోగులను మిగిలిన ఉద్యోగుల గూర్చి ప్రశ్నించగా.. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆధార్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. హాజరు పట్టికలో దొంగ సంతకాలు పెడుతూ, ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సెలవులు పెట్టడాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్, సంబంధిత అధికారులకు అక్కడ నుంచే ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ప్రజలకు సక్రమంగా సేవలు అందకపోతే ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

రాకపోకలు మెరుగుపరచాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహమూర్తి

నరసన్నపేట: వాల్తేరు డివిజన్ పరిధిలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఏర్పాటు చేసిన అండర్ పాసేజ్‌ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు రైల్వే బోర్డు మాజీ సభ్యుడు మంత్రి నర్సింహమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేసినట్లు నరసన్నపేటలో విలేకర్లకు తెలిపారు. నరసన్నపేట, జలుమూరు మండలాల్లో నిర్మించిన అండర్ పాసేజ్‌ల వద్ద వర్షం పడితే నీరు అధికంగా చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులకు అవస్థలకు తగ్గించడానికి అండర్ పాసేజ్‌లు నిర్మించారని, అయితే అవస్థలు పెంచి అసౌకర్యంగా ఉన్నాయన్నారు. ఈ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని నర్సింహమూర్తి కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: రానున్న రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా ముందుగానే జాగ్రత్త పడాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచలు ఇవ్వాలన్నారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ వేగతంతం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా భవానీ

జలుమూరు: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా బగ్గు భవానీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జలుమూరు ఎంఎంఎస్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. కోశాధికారిగా బైరి ఇందిర, ఉపాధ్యక్షురాలిగా వాన సావిత్రి, కార్యదర్శిగా బుడుమూరు హైమావతి ఎన్నికైనట్లు ఏపీఎం తివిటినాయుడు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న డీఎల్‌పీఓ రమణ

పాతపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. పాతపట్నం ఆల్‌ఆంధ్రరోడ్డు సమీపంలో ఉన్న చెత్తసంపద కేంద్రం వద్ద వనమహోత్సవంలో భాగంగా బుధవారం మొక్కలను నాటారు. ఈఓ దిలీప్, శిర్ల జోగారావు, ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఔదార్యం..

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తంగుడు సత్యం విజయవాడ వరద బాధితులకు విరాళం పంపించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆంధ్ర, తెలంగాణాల్లో వరద బాధితుల సహాయానికి సీఎం ఫండ్‌కు చెరో రూ.10 వేల చొప్పున బుధవారం విరాళాన్ని పంపించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న విశ్రాంత ఆర్ఐఓ రుక్మాంగధరరావు

నరసన్నపేట:

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఉత్తమ లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని విశ్రాంత ఆర్ఐఓ రుక్మాంగధరరావు అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రధాన వక్తగా వచ్చిన ఆయన విద్యార్థులకు సూచనలు చేశారు. ఎంఈఓ దాలినాయుడు మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు స్కూల్ పిల్లలకు ఆదర్శంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినిమా గీతాలకు నృత్యాలు చేసి సందడి చేశారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు రమణయ్య, ప్రిన్సిపాల్ కృష్ణారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరుదు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి



మజ్జి నరసమ్మ (ఫైల్)

బూర్జ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన మజ్జి నరసమ్మ(65) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసమ్మ మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో గ్రామంలో ఉన్న చికెన్ షాపునకు వెళ్లి రోడ్డు దాటుతుండగా బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో రాగోలు జెమ్స్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రిమ్స్ ఔట్‌పోస్టు ఇచ్చిన సమాచారం మేరకు, మృతురాలి కుమారుడు ఎం.సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ మండపం పరిశీలన



గణేష్ మండపాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

జలుమూరు: గణేష్ నవరాత్రులకు సంబంధించి అన్ని గ్రామాల ప్రజలు, ఆయా కమిటీలు ప్రశాంత వాతావరణలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎస్ఐ బి.అశోక్‌బాబు అన్నారు. బుధవారం చల్లవానిపేటలో గణేష్ ఉత్సవ మండపాలు పరిశీలించారు. నిబంధనలు ప్రకారం అన్ని ఉన్నాయా, లేదా అన్నది తనిఖీ చేశారు. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా ఉత్సవాల నిర్వహణ ఉండాలని, నిమజ్జనాలకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ వి.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పంటలు కాపాడుకోండి ఇలా..

ఆమదాలవలస: రిలియన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కేవీకేలో నిర్వహించిన మల్టీ లోకేషన్ ఆడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ 50 మంది రైతులకు సూచనలు అందించారు. వరి నాటుకున్న 40 రోజుల వ్యవధిలో మొదటి దఫగా 30 కిలోల యూరియా, హైడ్రాక్లోరైడ్ గుళికలు ఎనిమిది కిలోలు ఎకరాకు కలిపి వేసుకుంటే ఆకు ముడతను, పీకపురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. వర్షాల కారణంగా నీటిలో ఉన్న పొలాల నుంచి నీటిని తీసివేసి 30 కిలోల యూరియాను, 15 కిలోల పొటాష్‌ను ఒక ఎకరాకు చల్లుకుంటే మొక్కలు వేగంగా కోలుకుంటాయన్నారు. పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున హెక్సా కొనజోల్ అనే మందును రెండు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రై సైకలాజోల్ అనే ముందు 0.6 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ అధికారి డాక్టర్ తిరుమలరావు, భీమారావు పాల్గొన్నారు.

ఆ స్థలం మాదే..

సారవకోట: మండల కేంద్రం సారవకోట జైబీమ్ దళిత భవనానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం తమ ఆధీనంలో ఉందని జైబీమ్ సంఘం ప్రతినిధులు గోకర్ల సింహాచలం, యానాదిదాలయ్య అన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి కొంత మంది గిరిజన నాయకులం అంటూ చూస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.వెంకటరమణ, చిలకయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: పట్టణంలోని వెంగళరావుకాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించటం, విద్యుత్ మరమ్మతులను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ సత్తారు బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కనుగులవలస, వెంగళరావుకాలనీ, గేటు ఏరియా, పాత ఆమదాలవలస, టీఎస్ఆర్ కాలేజ్, రావికంటిపేట, కుద్దిరాం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

హిరమండలం: మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాత హిరమండలంలో బుధవారం జేసీబీతో కాలువలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగిస్తుంచారు. పారిశుద్ధ్య పనులను డీఎల్‌పీఓ వెంకటరావు, మేజర్ పంచాయతీ ఈఓ పరిశీలించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

హిరమండలం: మండలంలోని కూర్మ గ్రామం నుంచి అంతకాపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఇటీవల ఉపాధి హామీ పథకానికి సంబంధించి కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక, జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, ప్రత్యేక ఆహ్వానితుడు తిరుపతి రావు మాస్టారు, బోర ప్రసాదరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కొత్తూరు: కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ప్రకృతి వ్యవసాయం సాగు మరింత పెంచాలని సిబ్బందికి జిల్లా అదనపు డీపీఎం ధనుంజయరావుచెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సబ్ డివిజన్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు వివరాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సీమాస్త్రం, జిల్లేడు ద్రావణంతోపాటు పలు రకాల కషాయాల తయారీ విధానం, వాటి ప్రయోజనాలను వివరించారు. ప్రతి రైతు సొంతంగా తయారుచేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వైస్ ఎంపీపీ తులసీ వరప్రసాదరావు, ప్రకృతి వ్యవసాయం అధికారి బాబాజీ, ఎంటీ సూర్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బూర్జ: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని బూర్జ ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.గీత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో బూర్జ పీహెచ్‌సీ సీహెచ్ఓ కె.అప్పలస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.